

# ద్రష్ట
## కస్తూరి మురళీ కృష్ణ



**ఒక్కమాట**

దక్షిణ భారతం పైకి దండెత్తి వచ్చిన మొదటి ముస్లిం సేనాని మాలిక్ కాఫర్.

అల్లావుద్దీన్ ఖిల్జీ ఢిల్లీ పాలకుడిగా ఉన్న సమయంలో మాలిక్ కాఫర్ మలబారు తీరం వరకూ చొచ్చుకు వచ్చాడు. మధురపై దాడి చేశాడు. శ్రీరంగంలో మారణహోమం సృష్టించాడు. చిదంబర ఆలయాన్ని పునాదులతో సహా పెకిలించి వేశాడు. బోలెడంత సంపదను ఏనుగులపై మోసుకుని ఢిల్లీ తీసుకు వెళ్ళాడు. ఆ దండయాత్ర ఈ కథకు ఆధారం. మాలిక్ కాఫర్ దండయాత్ర వల్ల భారతీయ సమాజంలో జరిగిన అల్లకల్లోలాన్ని, భారతీయ మనస్తత్వం పై కలిగిన గాయాల ప్రభావాన్ని వర్ణించటం ఈ రచన ప్రధానోద్దేశ్యం.

మనకు సాధారణ చరిత్ర పుస్తకాలలో, కనబడని ఘోరమైన చేదు నిజాలు, మనల్ని మనం మరిచిపోతున్న తరుణంలో, మన పూర్వీకులు ఎన్ని దారుణమైన మారణకాండలను అనుభవిస్తూ కూడా ధర్మాన్ని పదిలంగా కాపాడాలో, ప్రజలకు తెలియ చెప్పాలన్న ఆశయంతో ఈ రచన సాగుతుంది. చరిత్రలో జరిగిన గాయాలను తిరిగి తోడటం కాదిది. మానని గాయాల స్వరూపాన్ని అర్థం చేసుకోవటం ద్వారా వాటి చికిత్సకు ఉపక్రమించుటంతో పాటు, భవిష్యత్తులో ఇటువంటి గాయాలు కాకుండా జాగ్రత్తలు పడేందుకు దేశ ప్రజలను ఉద్యుక్తులను చేయటం ఈ రచన లక్ష్యం. అనేక చారిత్రక ఆధారాలు, చారిత్రక పాత్రలు, కాల్పనిక పాత్రలలో కలగలిపి సాగించిన రచన ఇది.

మురళీకృష్ణ

**(గత సంచిక తరువాయి)**

**'పద్మిని తన నిర్ణయం స్పష్టంగా తెలిపింది.** ఇక దానిలో వాదోపవాదాలకు వివాదాలకు తావులేదు' కఠినంగా అన్నాడు శూరవర్మ.

ఎత్తిన కత్తిని దింపాడు చంద్రశేఖరుడు. అతడి కళ్ళల్లోని, క్రోధ భావన ఏమాత్రం తగ్గలేదు. ఊపిరి బుసలుకొడుతున్నట్టుంది. ఆవేశంతో శరీరం ఊగిపోతోంది.

గంగాధర శర్మ నిశ్చలంగా ఉన్నాడు. కానీ అతని అంతరంగం అల్లకల్లోలంగా ఉంది.

పద్మిని నిర్ణయం అతడిని ఆశ్చర్యపరుస్తోంది.

పద్మినితో తన ప్రవర్తన ఏనాడూ ఔచిత్య పరిధిని దాటలేదు. ఎన్నడూ పద్మినితో తాను అనుచితంగా ప్రవర్తించలేదు. అస్సలు ఆమెవైపు తాను సరిగ్గా చూడనూలేదు. మరి ఆమెకు తనపట్ల అలాంటి భావం ఎలా కలుగుతుంది?

పద్మిని పట్ల తనకు ఆకర్షణ లేదని కాదు ఆమె అంటే కుతూహలం లేదని కాదుకానీ, అది మామూలుగా ఒక యువతి పట్ల యువకుడికి ఉండే స్వాభావికమైన, ప్రాకృతికమైన కుతూహలం. పరిధిని ఏనాడూ దాటలేదు.

తనలో ఏం చూసి పద్మిని ఇలాంటి నిర్ణయం తీసుకుంది? గంగాధర శర్మ ఆలోచనలు తెగటంలేదు.

శూరవర్మ మనస్సు కూడా ఆందోళనమయం అయింది ఎందుకిలా జరుగుతోంది? చిన్న చిన్న విషయాలు, అప్రధానమైన అంశాలు, అసలైన విషయాలనుంచి దృష్టిని మళ్ళిస్తున్నాయి. ఒకవైపు శత్రువు ప్రచండవేగంతో తమ జీవితాలను కంబళించి వేస్తూంటే, మరోవైపు అప్రస్తుత అంశాల ఆధారంగా, కలిసి పోరాడాల్సిన వారు తమలో తాము కలహించుకుంటున్నారు.

ఐకమత్యం అవసరమైన చోట అనర్థాన్ని సృష్టిస్తున్నారు. శూరవర్మకు నిరాశగా అనిపించింది.

అక్కడ ప్రశాంతంగా ఉన్నది పద్మిని ఒక్కర్తే. తన నిర్ణయం సమంజసమైనదేనని ఆమె నమ్మకం.

చంద్రశేఖరుడు నెమ్మదిగా కత్తిదించాడు. అపుడు కానీ ప్రహరసింహుడు తన కత్తిని దింపలేదు.

'ఎవరేమనుకున్నా, ఎవరెంత అడ్డుపడినా, పద్మిని నాది. దాన్ని ఎవరూ మార్చలేరు' కసిగా అన్నాడు చంద్రశేఖరుడు.

నిశ్శబ్దం తప్ప చంద్రశేఖరుడి మాటలకు మరో ప్రతిస్పందన లేదు ఒకసారి అందరివైపు కసిగా చూసి, గిరుక్కున వెనక్కు తిరిగాడు చంద్రశేఖరుడు.

'ఎక్కడికి?' అడిగాడు గంగాధరశర్మ

'ఎక్కడికయితే నీకెందు?' కోపంగా అడిగాడు చంద్రశేఖరుడు.

'చంద్రశేఖరా, ఇది అందరం కలసి ఉండవలసిన సమయం' ఇంకా ఏదో చెప్పబోతున్న గంగాధర శర్మ చంద్రశేఖరుడు పెద్దగా నవ్వటంతో ఆగిపోయాడు.

'నీకు కావాల్సిన వన్నీ నీకు దొరుకుతున్నాయి కాబట్టి నువ్వు నీతులు చెపుతావు. అన్ని అర్హతలు ఉండీ ఏదో పొందలేని వాడిని నేను కడుపు మండేది నాకు' కసిగా అన్నాడు చంద్రశేఖరుడు.

'ఏమైంది నీకు? నీకేం నష్టం కలిగింది?' అయోమయంగా అడిగాడు గంగాధర శర్మ. వికటంగా నవ్వాడు చంద్రశేఖరుడు.

'చేసేవన్నీ చేసేసి అమాయకత్వం నటించకు. నువ్వు నా అన్నవైపోయావు. లేకుంటేనా?' అని కసిగా కత్తితో పక్కనే ఉన్న చెట్టును కొట్టాడు.

పద్మిని ఒక అడుగు ముందుకు వేసి, చంద్రశేఖరుడివైపు సూటిగా చూస్తూ చెప్పింది.

'చంద్రశేఖరా, ఇది నా స్వంత నిర్ణయం. దీన్లో వాదాలకు తావులేదు. ఈ విషయం ఎవ్వరికీ తెలియదు'

'జాణవి అసలు నువ్వే నన్ను మోసం చేశావు' అంటూ ఆమె పైకికత్తిని బలంగా విసిరాడు చంద్రశేఖరుడు.

మెరుపులా అతడి దాడినుంచి తప్పించుకుని, పక్కకు దూకి, పక్కన ఉన్న కత్తిని ఒకచేత్తో అందుకుని, దాన్ని మరో చేతిలోకి మార్చుకుని, చంద్రశేఖరుడి కత్తి వేటుకి కత్తిని అడ్డం పెట్టి, దాన్ని అతడి చేతిలోంచి ఎగరగొట్టింది.

అందరూ ఆశ్చర్యపోయేలా, కాలితో చంద్రశేఖరుడి కాలిని బలంగా తన్ని అతడిని పడవేసింది కత్తిని అతని మెడపై ఆన్చి నిలబడింది. అక్కడ ఉన్న అందరూ నిశ్చేష్టులయ్యారు.

'చంద్రశేఖరా, ఎదుటివారిని మనుషుల్లా పరిగణించి, వారి ఇష్టాఇష్టాలను గౌరవించగలిగేవాడే మనిషి. అలాకాక బలం ఉందన్న గర్వంతో, అందరిపై తన ఇష్టాయిష్టాలను రుద్దేవాడు పశువు. నీకు అర్థమయిందా ఇప్పుడయినా, నేను మనిషితో బ్రతకాలనుకుంటున్నానని' అంది తీవ్రంగా చంద్రశేఖరుడు మాట్లాడలేదు. కానీ అతడి కళ్ళు నిప్పులు కురిపిస్తున్నాయి.

శూరవర్మ ముందుకు వచ్చి పద్మినిని పక్కకు పంపాడు. చంద్రశేఖరుడుని లేపి నిలబెట్టాడు.

చంద్రశేఖరుడు అక్కడ ఒక్క నిమిషం కూడా నిలబడలేదు. గబగబా అటునుంచి వెళ్ళిపోయాడు. అతడు ఊర్లోకి వెళ్ళలేదు. అడవి వైపు వెళ్ళాడు.

'తొందర పడ్డావు పద్మినీ' అన్నాడు శూరవర్మ.

పద్మిని మాట్లాడలేదు. మౌనంగా నిలబడింది.

గంగాధర శర్మ పద్మిని దగ్గరకు వచ్చాడు.

'పద్మినీ నువ్వు నాలో ఏం చూశావో, ఏమి ఆలోచించావో నాకు తెలియదు. కానీ నీ నిశ్చయం శాశ్వతమైనదయితే, నేను తిరిగి వచ్చేవరకూ ఎదురుచూడు. నేను వచ్చేవరకూ నీ నిర్ణయం మారకపోతే అపుడు ఆలోచిద్దాం. ఈలోగా నీకు నచ్చిన వారెవరయినా తారసపడితే నేను నీకు ప్రతిబంధంకాను' మృదువుగా చెప్పాడు.

'నేను మిమ్మల్ని అనుసరిస్తాను' అంది పద్మిని.

తల అడ్డంగా ఊపాడు గంగాధర శర్మ.

'నువ్వు నా దృష్టిని మళ్ళిస్తావు. నా దృష్టి నా లక్ష్యం పైన కాక నీ రక్షణ పైనే ఉంటుంది నాకు. అది ఇష్టంలేదు. అదీగాక'

'అదీగాక?' రెట్టించింది పద్మిని

గంగాధర శర్మ మౌనంగా ఉన్నాడు.

'మేము తక్కువ కులం వారిమనా?'

'కాదు. ఇక్కడ కులం ప్రసక్తే లేదు'

'మరి?'

'పద్మినీ నీ వయసు చిన్నది. నువ్వు ప్రపంచం ఏమీ చూడలేదు. నీ జీవితంలో నీకు తారసపడిన వ్యక్తులెందరు? దానికి తోడు ప్రస్తుత పరిస్థితులు అల్లకల్లోలంగా ఉన్నాయి. ఎవరికీ భద్రతలేదు. ప్రతి విషయంలోనూ అనిశ్చింతతత తాండవం ఆడుతోంది. ఇలాంటి అల్లకల్లోల పరిస్థితులలో మనం సరిగ్గా ఆలోచించలేదు. తొందరపడి నిర్ణయాలు తీసుకుంటాం. నీదీ అలాంటి తొందరపాటు నిర్ణయమే. కాబట్టి కొన్నాళ్ళు నేను ఎదురుగా కనబడకపోతే, అపుడు నీకు వేరె ఎవరైనా తారసపడితే, అప్పటికీ నీ మనసు నాపైనే ఉంటే, నీ నిర్ణయం ఆవేశంలోనో, తొందరపాటుగానో తీసుకున్నది కాదని తెలుస్తుంది.' అన్నాడు గంగాధర శర్మ.

పద్మిని విచిత్రంగా నవ్వింది.

'మీకు ఆత్మ విశ్వాసంలేనట్టుంది. అది ఎదుటి వారిమీద అవిశ్వాసంలా పరిణమిస్తోంది. బహుశా, మగవారంతా ఇంతేనేమో!' అంది పద్మిని.

'పద్మినీ, నువ్వేమనుకున్నా నా అభిప్రాయం చెప్పాను. నేను నీ నిర్ణయాన్ని గౌరవించినట్టే, నువ్వు నా నిర్ణయాన్ని గౌరవించాలి. నేను శ్రీరంగం ఒంటరిగా వెళ్తాను. అది మారదు' అంటూ ప్రహర సింహుడి వైపు తిరిగాడు.

'ప్రహరా, పద్మినిని ఇప్పుడు కాపాడుతున్నట్టే కంటికి రెప్పలా కాపాడుతూండు. నేను వీలయినంత త్వరగా తిరిగి వస్తాను' అన్నాడు గంగాధరుడు.

ప్రహరసింహుడు తల ఊపాడు.

గంగాధరుడు, శూరవర్మకు నమస్కరించాడు.

'మీరు నాకు గురుతుల్యులు ఆశీర్వదించండి' అన్నాడు తలవంచి

శూరవర్మ నవ్వాడు.

అందరి వైపు ఒక్కసారి చూశాడు గంగాధర శర్మ. అతని చూపులు పద్మినిపై కాస్సేపు ఎక్కువగా నిలిచాయి. ఆమె రూపాన్ని కళ్ళల్లో సృష్టించుకున్నట్టు ఉన్నాయి అతని చూపులు. తరువాత నెమ్మదిగా భూమిని వంగి తలతో తాకాడు. వెనుతిరిగి ఊరికి వ్యతిరేక దిశలో నడవటం ఆరంభించాడు.

అందరూ మౌనంగా అతడు వెళ్ళిన వైపే చూస్తూ నిలబడ్డారు.

నెమ్మదిగా కనుచూపు మేర దాటి పోయాడు గంగాధర శర్మ.

ఒకరొకరుగా ఊర్లో వాళ్ళు వెనుతిరిగారు. వారంతా మూటలు సర్దుకోసాగారు.

అక్కడ నిలబడి గంగాధర శర్మ వెళ్ళిన దిశవైపే చూస్తుండిపోయింది పద్మిని.

ఆమె కళ్ళలో ఎలాంటి భావంలేదు.

ఆమె వెనకే రక్షగా నిలబడి ఉన్నాడు ప్రహరసింహుడు అతడి ముఖంలో ఎలాంటి భావంలేదు.

●●●

(కొనసాగింపు వచ్చేసంచికలో)

POST YOUR COMMENTS